# కేసీఆర్ పాలనలో అన్ని వర్గాలకు లబ్ధి



సభ స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే శంకర్ నాయక్

- కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి
- సీఎం సభను జయప్రదం చేయాలి
- మంత్రి సత్యవతి రాథోడ్

మహబూబాబాద్ రూరల్, అక్టోబర్ 25 : సీఎం కేసీఆర్ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరుతుందని గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. నియోజకవర్గ పరిధిలో ఈ నెల 27న నిర్వహించే సీఎం కేసీఆర్ బహిరంగ సభ స్థలాన్ని ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణ శివారులోని శనిగపురం రోడ్‌లో ప్రజా ఆశీర్వాద సభకు భారీగా జన సమీకరణ చేయాలన్నారు. బహిరంగ సభకు వచ్చే నాయకులు, కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బీఆర్‌ఎస్ నాయకులు వలంటీర్లుగా ఉండాలన్నారు. హెలీప్యాడ్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీ నాయకులు కేసీఆర్ చేసిన అభివృద్ధిని చూసి ఓర్వలేకే అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. ప్రజలు కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మే స్థితిలో లేరన్నారు. కేసీఆర్ పేదల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టారని, ప్రతి కుటుంబానికి చేరుతున్నాయన్నారు. అనేక నిధులు కేటాయించడం వల్లే జిల్లాలో ఇంత అభివృద్ధి జరిగిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీయే ఘన విజయం సాధిస్తుందన్నారు. కేసీఆర్ సభను పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని కోరారు. అనంతరం నియోజక వర్గంలోని వివిధ మండలాల నాయకులతో కేసీఆర్ సభ గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు, సర్పంచ్‌లు, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రామప్పలో పర్యాటకుల సందడి

వెంకటాపూర్, అక్టోబర్ 25 : మండలంలోని రామప్ప దేవాలయం దస రా సెలవుల సందర్భంగా బుధవారం పర్యాటకులు, భక్తులతో సందడిగా మా రింది. తెలంగాణతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో పర్యాటకు లు సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్ పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ చరిత్ర, విశిష్టతను టూరిజం గైడ్స్ వివరించారు. అనంతరం రామప్ప సరస్సులో బోటింగ్ చేసి ఆహ్లాదంగా గడిపారు.

**28న ఆలయం మూసివేత**

ఈనెల 28వ తేదీ శనివారం మధ్యాహ్నం 2 గంటల తర్వాత చంద్రగ్రహణం నేపథ్యంలో రామప్ప దేవాలయాన్ని మూసివేయనున్నట్లు ఈవో బిల్లా శ్రీనివాస్ తెలిపారు. మధ్యాహ్నం వరకు పూజా కార్యక్రమాలు జరుగుతాయని, అనంతరం గర్భగుడిని మూసివేసి తిరిగి 29న ఉదయం 6 గంటలకు ఆలయ ద్వారం తెరిచి సంప్రోక్షణ, అభిషేకం అనంతరం భక్తులను దర్శనానికి అనుమతిస్తామని ఈవో తెలిపారు.



దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

# సీఎం కేసీఆర్ సభను జయప్రదం చేయాలి

- పదివేల మందిని తరలించాలి
- మానుకోటపై గులాబీ జెండా ఎగురెయ్యాలి
- ఎంపీపీ మాధవి, జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి

నెల్లికుదురు, అక్టోబర్ 25 : ఈ నెల 27న మహబూబాబాద్‌లో నిర్వహించే సీఎం కేసీఆర్ సభను జయప్రదం చేయాలని ఎంపీపీ ఎర్రబెల్లి మాధవి, జడ్పీటీసీ మేకపోతుల శ్రీనివాస్‌రెడ్డి కోరారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి 10 వేల మందిని తరలించాలన్నారు. మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో బుధవారం పార్టీ మండల అధ్యక్షుడు పరుపాటి వెంకట్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత బానోత్ శంకర్ నాయక్‌ను మూడోసారి ఎమ్మెల్యేగా గెలిపించుకొని మానుకోట గడ్డపై గులాబీ జెండా ఎగురవేయాలన్నారు. అందుకోసం ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని కోరారు. బీఆర్‌ఎస్ నుంచి ఇతర పార్టీలకు వెళ్తున్నారనేది అవాస్తవమన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీల నుంచే బీఆర్‌ఎస్‌లోకి చేరడానికి గల్లీనుంచి రాష్ట్ర నాయకుల వరకు సిద్ధంగా ఉన్నారన్నారు. నెల్లికుదురు మండలం గతంలో అత్యధిక మెజార్టీ ఇచ్చిందన్నారు. ఈసారి అత్యధిక మెజార్టీని ఇచ్చేలా అందరం కలికట్టుగా సమన్వయంతో పని చేయాలన్నారు. ఈ నెల 27న జరిగే సీఎం కేసీఆర్ సభకు ప్రతి గ్రామం నుంచి 3 వేల మందికిపైగా తరలించాలని, అందుకు వాహనాలను సమకూర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి వెన్నాకుల శ్రీనివాస్, ఆర్బీఎస్ మండల కోఆర్డినేటర్ కాసం వెంకటేశ్వర్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ కే విజయ్ యాదవ్, యూత్ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు చిర్ర యాకాంతం, నాయకులు ఆకుల జగ్గయ్య, పులి రామచంద్రు, వినోద్ రెడ్డి, దాసరి ప్రకాశ్, ఆదిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, దేవేందర్‌రావు, అశ్విన్, బండారి శ్రీనివాస్‌రెడ్డి, సంతోశ్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రజా ఆశీర్వాద సభను సక్సెస్ చేయాలి**

**సర్పంచ్ దార్ల రామ్మూర్తి**

ఇనుగుర్తి : 27న మహబూబాబాద్‌లో సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభను సక్సెస్ చేయాలని సర్పంచ్ దార్ల రామ్మూర్తి కోరారు. బుధవారం మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నజీర్ అహ్మద్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బొబ్బిలి మహేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ధీకొండ వెంకన్న, సర్పంచ్‌లు మామిడి శోభన్,రామన్నా నాయక్, ఎంపీటీసీ పింగిళి రజితా శ్రీనివాస్, గ్రామ అధ్యక్షుడు బేతమల్ల చంద్రయ్య, ప్రధాన కార్యదర్శి గండు నాగన్న తదితరులు పాల్గొనారు.



నెల్లికుదురు : సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ మాధవి, జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి



ఇనుగుర్తి : సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ రామ్మూర్తి



బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

## కేసీఆర్ పాలనలో గ్రామాలు అభివృద్ధి

మహబూబాబాద్ రూరల్, అక్టోబర్ 25 : సీఎం కేసీఆర్ పాలనలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు కొయ్యల కొమురవెల్లి అన్నారు. బుధవారం జంగిలికొండ గ్రామంలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలకులు గ్రామీణాభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. పేదల కోసం సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టారన్నారు. ప్రజలు బీఆర్‌ఎస్‌ను ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ బీసీ సెల్ మండల అధ్యక్షుడు నలమాల సుధాకర్, పూజల శ్రీనివాస్, సత్తిరెడ్డి, భిక్షం, వెంకన్న, రమేశ్, వీరన్న, వేణు తదితరులు పాల్గొన్నారు.

## కాల్వలో పడి యువకుడి మృతి

పెద్దవంగర, అక్టోబర్ 25 : ప్రమాదవశాత్తు ఎస్సారెస్పీ కాల్వలో పడి యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని పోచంపల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై పీ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. జనగాం జిల్లా, పాలకుర్తి మండలం, వల్మిడి గ్రామానికి చెందిన దండెంపల్లి శివ(31) ఈ నెల 23న తొర్రూరులో తన మేనమామ ఇంటికి వచ్చాడు. నాంచారిమడూర్ వద్ద గల ఎస్సారెస్పీ కాల్వ వద్ద కాలకృత్యాల కోసం వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడిపోయాడు. 24న సాయంత్రం పోచంపల్లి గ్రామ శివారులోని కాల్వలో శవమై తేలాడు. మృతుడి తల్లి దండంపల్లి అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## పోచంపల్లిలో మావోయిస్టుల వాల్ పోస్టర్లు

రేగొండ, అక్టోబర్ 25 : మండలంలోని పోచంపల్లి గ్రామంలో మావోయిస్ట్ వాల్ పోస్టర్లు బుధవారం వెలియడంతో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పోచంపల్లికి చెందిన గాదెబోయిన సమ్మయ్యను హెచ్చరిస్తూ బడే చొక్కారావు అలియాస్ దామోదర్ (మావోయిస్ట్ చర్ల శబిరి ఏరియా కమిటీ) పేరిట పోస్టర్లు వెలిశాయి. 'ఎన్నో అరాచకాలకు పాల్పడినా భరిస్తూ వచ్చాం. నీలో ఎలాంటి మార్పు రాలేదు. నీ చావు అతి భయంకరంగా ఉంటుంది. రోజులు లెక్కపెట్టుకో' అంటూ అందులో పేర్కొన్నారు.



ఆర్థిక సాయం అందిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

## ఆర్థిక సాయం అందజేత

కురవి, అక్టోబర్ 25 : మండలంలోని బలపాల గ్రామంలో చేపల చంద్రయ్య(60) అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని బుధవారం బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు నామ సైదులు, ఎంపీటీసీ పిట్టల రమణా ఉపేందర్ పరామర్శించి రూ.3000 ఆర్థిక సాయం అందజేశారు. అధైర్యపడవద్దని, పేదలకు అండగా బీఆర్‌ఎస్ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వెంకన్న, గావంటి సైదులు, నద్దునూరి రాములు తదితరులు పాల్గొన్నారు.

## గుడుంబా తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

వాజేడు, అక్టోబర్ 25 : ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి గుడుంబా తరలిస్తున్న వ్యక్తిని బుధవారం వాజేడు పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్సై చావాళ్ల వెంకటేశ్వరరావు కథనం ప్రకారం మండలంలోని ఘణపురం గ్రామం వద్ద సీఆర్పీఎఫ్ పోలీసులతో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. బైక్‌పై వస్తున్న ఘనపురం గ్రామానికి చెందిన కుమ్మరి గోపిచంద్ వద్ద రూ. 13,500 విలువైన 45 లీటర్ల గుండుంబా పట్టుబడింది. నిందితుడిని అరెస్ట్ చేసి, గుడుంబాను స్వాధీనం చేసుకొని బైక్ సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

## పోలింగ్ బూత్‌లను సిద్ధంగా ఉంచాలి

తాడ్వాయి, అక్టోబర్ 25 : మండలంలోని పోలింగ్ బూత్‌లలో ఎలాంటి సమస్యలు లేకుండా సిద్ధంగా ఉంచాలని అడిషనల్ కలెక్టర్ వేణుగోపాల్ ఆదేశించారు. మండలంలోని పలు గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను బుధవారం తహసీల్దార్ తోట రవీందర్, ఎంపీవో శ్రీధర్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఎన్నికల సిబ్బందికి ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చర్యలు చేపట్టాలన్నారు.